ప్లాస్టిక్‌పై సమరం.. ప్రచారానికే పరిమితం

- శ్రీవారి క్షేత్రంలో యథేచ్ఛగా ప్లాస్టిక్ కవర్ల విక్రయాలు
- భక్తుల చేతుల్లో దర్శనమిస్తున్న కవర్లు
- చోద్యం చూస్తున్న అధికారులు, సిబ్బంది

ద్వారకాతిరుమల: ప్రముఖ దేవాలయాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువుల వాడకాన్ని నిషేధిస్తూ ఇటీవల దేవాదాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో ప్రముఖ పుణ్య క్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న దేవస్థానం అధికారులు కొండపైన, కొండ కింద ఉన్న దేవస్థానం దుకాణాల్లోని వ్యాపారులకు నోటీసులు జారీ చేశారు. అలాగే ప్లాస్టిక్ కవర్ల వినియోగం నిషేధమని నిత్యం మైక్‌ల ద్వారా ప్రచారం చేస్తున్నారు. కానీ వాటి విక్రయాలను, వినియోగాన్ని మాత్రం అడ్డుకోలేక పోతున్నారు. దీంతో క్షేత్రంలో ప్లాస్టిక్ కవర్ల వినియోగం యథేచ్ఛగా సాగుతోంది. ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణ ఆంధ్రలో భాగంగా పర్యావరణాన్ని పరిరక్షించేందుకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని ఉన్నతాధికారులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో దేవాదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ రాష్ట్రంలోని అన్ని ప్రముఖ దేవాలయాల్లో 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్లు, వస్తువుల వినియోగాన్ని నిషేధిస్తూ 20 రోజుల క్రితం ఆలయ అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగానే శ్రీవారి దేవస్థానం అధికారులు ఆలయ పరిసరాల్లోని దుకాణాల యజమానులకు నోటీసులు ఇచ్చి, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తే చర్యలు చేపడతామని హెచ్చరించారు.


ఆలయ ఆవరణలో భక్తుల చేతుల్లో ప్లాస్టిక్ కవర్లు

అయినా ఫలితం ఉండటం లేదు.

ఆదేశాలు భేఖాతరు

ఆలయ అధికారుల ఆదేశాలను కొందరు వ్యాపారులు భేఖాతరు చేస్తున్నారు. తమ వ్యాపారాలు సజావుగా సాగాలని భక్తులకు ప్లాస్టిక్ కవర్లను అందిస్తున్నారు. దీంతో అధికారుల లక్ష్యం నీరుగారుతోంది. ముఖ్యంగా కొబ్బరి కాయలు, పూజా సామగ్రి, తులసి దండలు, ఫ్యాన్సీ దుకాణాల్లో ఈ కవర్లను భక్తులకు ఇస్తున్నారు. దీంతో ఏ భక్తుడి చేతిలో చూసినా ప్లాస్టిక్ కవర్లే దర్శనమిస్తున్నాయి. ఆలయ పరిసరాల్లో ప్లాస్టిక్ కవర్లతో భక్తులు సంచరిస్తున్నా అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అడపాదడపా ఉన్నతాధికారుల ఆదేశాలు, ఒత్తిళ్ల మేరకే ఆలయ అధికారులు తూతూమంత్రంగా వ్యాపారులకు నోటీసులిచ్చి చేతులు దులుపుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే కొండ కింద లింగయ్య చెరువు, గుడి సెంటర్‌లో వ్యాపారులు భక్తులకు కవర్లతో నిమ్మకాయలు, పండ్లు, కూరగాయలను విక్రయిస్తున్నారు. మండల, పంచాయతీ అధికారులు వీటిని చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్లాస్టిక్ నిర్మూలనకు కఠిన చర్యలు చేపట్టి, పర్యావరణాన్ని పరిరక్షించాలని పలువురు కోరుతున్నారు.


కొండ కింద లింగయ్య చెరువు వద్ద వ్యాపారుల చేతుల్లో నిమ్మకాయల కవర్లు


తులసి దండలను కవర్‌లో తీసుకెళుతున్న భక్తుడు

ఆలయాల్లో వినియోగించాల్సినవి

- ప్లాస్టిక్ కవర్లకు బదులుగా కాటన్, జ్యూట్ బ్యాగ్‌లు, కర్ర సంచులను వాడాలి.
- ప్లాస్టిక్ ప్లేట్లు, కప్పులు, స్పూన్లకు బదులు ఆకులు లేదా ఫుడ్ గ్రేడ్ లామినేటెడ్‌తో తయారు చేసిన పేపర్ ప్లేట్లు, కప్పులను వాడాలి.
- థర్మాకోల్ ఐటమ్స్‌కు బదులు స్టీల్, సిరామిక్ ఐటమ్స్‌ను వాడాలి.
- ప్లాస్టిక్ స్ట్రాలు, జెండాలు, బ్యానర్లకు బదులుగా క్లాత్, వెదురుతో తయారైన వాటిని వాడాలి.
- భక్తులకు అన్నప్రసాదాన్ని అరటి ఆకులు, స్టీల్ ప్లేట్లలోనే వడ్డించాలి.
- ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ విక్రయాలను నిషేధించి, ఆలయ ఆవరణలోని ఆర్‌వో ప్లాంట్ల వద్ద స్టీల్ గ్లాసులను ఏర్పాటు చేయాలి.

వినాయకా.. సెలవిక!

- అట్టహాసంగా గణేష్ నిమజ్జన వేడుకలు
- ఆకట్టుకున్న చిత్ర విచిత్ర వేషధారణలు

ద్వారకాతిరుమల: గణేష్ నిమజ్జన వేడుకలు అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ద్వారకాతిరుమలలో బుధవారం నిర్వహించిన వేడుకలు అంబరాన్నంటాయి. స్థానిక ఆర్చిగేటు కూడలిలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాన్ని ఉత్సవ కమిటీ సభ్యులు ముందుగా ఒక వాహనంలో ఉంచి, పండ్లు, పూలతో విశేషంగా అలంకరించారు. అనంతరం స్వామి వారిని వాహనంలో పురవీధుల్లో ఊరేగించి పంగిడిగూడెంలోని పోలవరం కుడి కాలువలో నిమజ్జనం చేశారు. స్థానిక దేవస్థానం హైస్కూల్ పక్కన గణేష్ మండపం వద్ద భారీ అన్నసమారాధనను నిర్వహించారు. ముందుగా ఉత్సవ కమిటీ సభ్యులు స్వామి వారికి పూజలు నిర్వహించారు.

వేలంలో లంబోదరుని లడ్డూ రూ.లక్ష

కొయ్యలగూడెం: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు బుధవారం గణేష్ శిబిరాల వద్ద అన్నసమారాధన కార్యక్రమాలు, ఊరేగింపు ఉత్సవ కార్యక్రమాలు మండల వ్యాప్తంగా ఉన్న పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. రామానుజపురంలోని శ్రీఅభయ ఆంజనేయ స్వామి విగ్రహం ఎదుట ఏర్పాటు చేసిన గణనాథునికి సమర్పించిన 108 కేజీల భారీ లడ్డూకు వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన రైతు కోనే బాలకృష్ణ స్వామి వారి లడ్డూను వేలంలో చిక్కించుకున్నాడు. గురువారం 4వ తేదీ వైఎస్సార్ నగర్, తహసీల్దార్ కార్యాలయం వెనుక, అశోక్ నగర్, మిషనరీ హాస్పిటల్ గణనాథుల శిబిరాల వద్ద అన్న సమారాధన కార్యక్రమాలు ఊరేగింపు నిమజ్జనోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

అన్నసమారాధన

జంగారెడ్డిగూడెం: పట్టణంలో గణపతి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఎనిమిదో రోజు పట్టణంలో పలు మండపాల వద్ద ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలకు విశేష పూజలు నిర్వహించారు. ఆయా మండపాల వద్ద అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక వెలమపేటలో దివంగత అప్పలనాయుడు ఇంటి వద్ద నిర్వహిస్తున్న వరసిద్ధి వినాయక మహోత్సవంలో బుధవారం అన్నసమారాధన నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు, రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాధరావు, స్థానిక నాయకులు పాల్గొని అన్నసమారాధన కార్యక్రమం ప్రారంభించారు.

ఘనంగా గణపతి ఊరేగింపు

లింగపాలెం: గణపతి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజైన బుధవారం మండలంలోని కె.గోకవరం గ్రామంలో అభయ ఆంజనేయ స్వామి గుడి వద్ద ఏర్పాటు చేసిన వినాయకునికి కమిటీ యూత్ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులకు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మందాటి అశోక్, గజ్జల అరుణ్ కుమార్, చప్పిడి నాగరాజు, సుగంధం రామారావు, ఎ.సర్వేశ్వరరావు, మొగల్ల కిషోర్, చుక్క వెంకటేశ్వరావు, కొట్టే సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.


కొయ్యలగూడెం: లడ్డూను వేలంలో దక్కించుకున్న బాలకృష్ణ


జంగారెడ్డిగూడెం: అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జెట్టి గురునాధరావు


ద్వారకాతిరుమల: వినాయకుని ఊరేగింపులో కేరళ డప్పు వాయిద్యాలు


లింగపాలెం: వినాయకునికి పూజలు చేస్తున్న కమిటీ యూత్ సభ్యులు

బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలి

జంగారెడ్డిగూడెం: కామవరం, గుబ్బలమంగమ్మ గుడికి బస్సు ఏర్పాటు చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యులు కారం రాఘవ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ప్రతినిధి బృందం జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు కారం రాఘవ మాట్లాడుతూ గిరిజనుల పూజించే గుబ్బల మంగమ్మ దేవాలయానికి చుట్టుపక్కల నాలుగైదు జిల్లాల ప్రజలు భారీగా హాజరవుతారని గతంలో గుబ్బల మంగమ్మ గుడికి ఆదివారం మూడు ట్రిప్పులు బస్సు తిరిగేదని ఇటీవల ఆ బస్సును నిలిపివేశారని దాన్ని వెంటనే పునరుద్ధరించాలని కోరారు. అలాగే జంగారెడ్డిగూడెం పందిరిమామిడి గూడెం బస్సు కామవరం దాకా గతంలో వెళ్లేదని ఇప్పుడు పందిరిమామిడి గూడెం వరకు వెళ్లి వెనక్కి వస్తుందన్నారు. దీని వలన 10 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఆ బస్సును కామవరం వరకు పునరుద్ధరించాలని కోరారు. ఈ మేరకు డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ, స్థానిక నాయకులు కుర్సం గంగరాజు, గుండి రాముడు, కె.గంగాధరరావు, గుజ్జు రామారావులు పాల్గొన్నారు.


ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో రేషన్ స్మార్ట్ కార్డులు పంపిణీ బుధవారం పంపిణీచేశారు. స్థానిక 26వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. స్మార్ట్ కార్డులను లబ్ధిదారులు పదిలం పుల్లయ్య, ఎం.రుక్మిణి, అన్నపరెడ్డి రాజు, ముద్రగోల సూర్యారావు, కంచర్ల రామకృష్ణ, గుమ్మడు దానియేల్ తదితరులకు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఉగ్గం ప్రసాద్, షేక్ అమీర్, నౌడు అశోక్‌కుమార్, చింతకాయల అచ్చిరాజు, చిటికెల సత్యనారాయణ, కురుపూడి రాంబాబు, కాళిదాసు శ్రీను, పాదిలి చినబాబు, మడకం అప్పారావు, వీఆర్‌వో ఆకుల గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

టి.నరసాపురంలో..

టి.నరసాపురం: మండలంలోని కె.జగ్గవరం గ్రామ సచివాలయంలో బుధవారం స్మార్ట్ రేషన్ కార్డులను సర్పంచ్, మాజీ సర్పంచ్ కూటమి నాయకులతో కలిసి మహిళలకు, రేషన్ లబ్ధిదారులకు అందజేశారు. కేతవరం సర్పంచ్ తడికలపూడి మాధవి, మాజీ సర్పంచ్ నాగబాబు, వెలిది గంగాధరరావు, చల్లగుళ్ల రమేష్, వెంకటనారాయణ, అగ్నిపర్తి పరాపతిరావు, ఇందు, యాదయ్య పాల్గొన్నారు.


స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

రోడ్డెక్కిన గ్రీన్‌ఫీల్డ్ హైవే రైతులు


గుర్వాయిగూడెం గ్రీన్‌ఫీల్డ్ హైవే వద్ద ఆందోళన చేస్తున్న రైతులు


అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులు గురువాయిగూడెం వద్ద జంగారెడ్డిగూడెం–ఏలూరు రోడ్‌లో తమ సమస్యల పరిష్కారానికి రోడ్డెక్కి బుధవారం రాస్తారోకో నిర్వహించారు. సర్వీస్ రోడ్లు ప్రొవిజన్ కల్పించాలని, సర్వీస్ రోడ్‌లో మొక్కలు, చెట్లు వేయొద్దని నినాదాలు చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు జంగారెడ్డిగూడెం మండల తహసీల్దార్, హైవే అధికారులు, రోడ్డు నిర్మాణ సంస్థ బికం ప్రతినిధులు గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల సమస్యల పరిశీలనకు పర్యటన చేశారు. దేవులపల్లి, పుట్లగట్లగూడెం, గురవాయిగూడెం, లక్కవరం, పేరంపేట, పంగిడిగూడెం గ్రామాల రైతులు ఆయా గ్రామాల వద్ద పెద్ద సంఖ్యలో చేరుకుని సమస్యలు ఏకరువు పెట్టారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులు పోరాట కమిటీ నాయకులు వామిశెట్టి హరిబాబు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు శీలం రామచంద్రరావు, భూ నిర్వాసిత రైతులు పుసులూరి శ్రీహరి, గోలి నర్సిరెడ్డి, వందనపు సాయిబాబా, అందుగుల మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే రైతుల సమస్యలు పరిష్కరించాలి

కొయ్యలగూడెం: ఆర్బిట్రేషన్ పిటిషన్‌ను పరిశీలించి తమకు న్యాయం చేయాలని గ్రీన్‌ఫీల్డ్ హైవే రైతులు కోరారు. బుధవారం గ్రీన్‌ఫీల్డ్ హైవే రైతుల సమస్యల పరిశీలనకు వచ్చిన అధికారులకు రైతులు వినతిపత్రం అందజేశారు. తమ అభ్యర్థనలు పరిశీలించి, న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కన్నాయిగూడెం గ్రీన్‌ఫీల్డ్ హైవే రైతులు పాల్గొన్నారు.

రైతులకు సస్యరక్షణ చర్యలపై అవగాహన

కొయ్యలగూడెం: పరింపూడిలో సమీపంలోని రైతుల వ్యవసాయ క్షేత్రాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బీఆర్ శ్రీనివాసన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రైతులకు వ్యవసాయ పద్ధతులు, పాడిపంటల సస్యరక్షణ గురించి అవగాహన కల్పించారు. పశుసంవర్ధక సహాయకులు కె.సతీష్ వర్షాకాలంలో పశువులకు సంక్రమించే వ్యాధులు వాటి నుంచి ముందుస్తూ జాగ్రత్త అదే విధంగా పాడి అభివృద్ధి చేసుకునే విధానాలు గురించి అవలంభిస్తున్న ఆధునిక పద్ధతులను రైతులకు తెలిపారు.

బీసీ హాస్టళ్ల తరలింపుపై నిరసన

కొయ్యలగూడెం: బాలుర బీసీ హాస్టల్, బీసీ బాలుర కళాశాల హాస్టల్ తరలింపు నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని బీసీ సంఘాలు బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన, ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. బీసీ చైతన్య సంక్షేమ సంఘం, గౌడ సంఘాల నేతలు హాజరైన ఆందోళన కార్యక్రమానికి సీపీఐ మండల కన్వీనర్ తాడిగడప ఆంజనేయరాజు నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అంకాలుగూడెంలోని ఉన్న బాలుర కళాశాల హాస్టల్, అదే విధంగా పరింపూడి లోని ఉన్న బీసీ బాలుర హాస్టల్ వేరే నియోజకవర్గంలోని మండలానికి ప్రజాప్రతినిధులు తరలించే నిర్ణయానికి వచ్చినట్లు తెలిపారు. దీనిపై గతంలోఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు వినతి పత్రం సమర్పించామని ఆంజనేయరాజు తెలిపారు. కానీ స్పష్టత లేకపోవడంతో పాటుగా హాస్టళ్ల తరలింపు ప్రక్రియ కొనసాగుతుండడం పట్ల వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ హాస్టళ్ళు తరలించడం వలన విద్యా ప్రగతి కుంటుపడుతుందని పేర్కొన్నారు. తహసీల్దార్ ఎన్.నాగరాజుకు వినతిపత్రం సమర్పించారు. బీసీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెలగల దుర్గారావు, సీహెచ్ శ్రీనివాస్, ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


వినతి పత్రం సమర్పిస్తున్న బీసీ సంఘాల నేతలు

అంజన్న ఆలయంలో పవిత్రోత్సవాలు

జంగారెడ్డిగూడెం: స్వయంభు శ్రీమద్ది ఆంజనేయ స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు. పవిత్రోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం 6 గంటలకు విశ్వక్సేన పూజ, పుణ్యాహ వాచనం, సప్తకలశస్నపన, పవిత్ర ఆరోపణ, శాంతి హోమాలు, చతుర్వేద అధ్యయనం, నీరాజన మంత్ర పుష్పాలు సాయంత్రం 6 గంటల నుంచి విశ్వక్సేన పూజ, పుణ్యా హవాచనం, మహా శాంతి హోమం, చతుర్వేద అధ్యయనం, నీరాజన మంత్ర పుష్పాలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. గురువారం ఉదయం 6 గంటల నుంచి పవిత్ర విసర్జన, మహా పూర్ణాహుతి, దీక్షా విసర్జన, మహదాశీర్వచనం, పండిత సత్కారాలు నిర్వహింపబడునన్నారు. అలాగే 7వ తేదీ సంపూర్ణ చంద్ర గ్రహణం కారణంగా 7వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు ఆలయం మూసివేయనున్నట్లు ఈవో తెలిపారు. సంప్రోక్షణ అనంతరం తిరిగి 8వ తేదీ సోమవారం ఉదయం 9 గంటలకు సర్వదర్శనం ప్రారంభమగునని కార్య నిర్వాహణాధికారిణి ఆర్‌వీ చందన తెలిపారు.


మద్ది ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

క్లుప్తంగా

వైఎస్ జగన్‌తోనే అభివృద్ధి సాధ్యం


చిటికెన శ్రీనివాస్‌ను అభినందిస్తున్న గౌడ సంఘం నాయకులు

కొయ్యలగూడెం: వైఎస్ జగన్‌తోనే రాష్ట్రంలో మళ్లీ అభివృద్ధి సాధ్యమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి చిటికెన శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం ఆయన నివాసంలో గౌడ సంఘం ప్రతినిధుల అభినందన కార్యక్రమం నిర్వహించి శ్రీనివాసుని సాలువాతో సత్కరించారు. ఇటీవల పార్టీ అధిష్ఠానం అల్లూరి, అనకాపల్లి రెండు జిల్లాలకు శ్రీనివాస్‌ని ప్రచార విభాగం ఇన్‌చార్జిగా బాధ్యతలను అప్పగించినందుకు అభినందిస్తూ పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో మట్టా సత్యనారాయణ, మన్యం నాగేశ్వరరావు, మన్యం మహేష్(రవి), సిరిబత్తుల పోసియ్య, మార్గాన్ని మంగరాజు, మార్గాన్ని పోసియ్య, రమని మంగు, మన్యం శ్రీను, ఎలగాని ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో పూజలు



జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయి గూడెం శ్రీహరి హరసుత అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం సందర్భంగా స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. పంచామృతాలతో అభిషేకించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ భక్తులకు ప్రసాద వితరణ చేశారు. భక్తులు పాల్గొన్నారు.

ఎరువుల సరఫరాలో రైతులకు ప్రాధాన్యం


రైతులతో మాట్లాడుతున్న సీఐ క్రాంతికుమార్, వ్యవసాయాధికారులు

చింతలపూడి: ఎరువుల సరఫరాలో రైతులకు ప్రాధాన్యత ఇస్తామని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వై.సుబ్బారావు తెలిపారు. జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్, జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర ఆదేశాల మేరకు చింతలపూడి సీఐ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో ఎస్సై కె.సతీష్ కుమార్ బుధవారం స్థానిక కో–ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ స్టాక్ పాయింట్‌ను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి కె.మురళీకృష్ణతో కలిసి రైతులకు యూరియా పంపిణీ విధానాన్ని సమీక్షించారు.

సరిపల్లి పీఏసీఎస్‌లో విచారణ


విచారణ చేస్తున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్

కొయ్యలగూడెం: సరిపల్లి పీఏసీఎస్‌లో బుధవారం ఏలూరు డీసీఓ కార్యాలయం నుంచి వచ్చిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ మూర్తి, సభ్యులు, రైతు నాయకుల సమక్షంలో విచారణ నిర్వహించారు. గ్రామానికి చెందిన బండి గంగారత్నం, దొండపాటి భూలక్ష్మి, తొంటా సూర్యారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంక్వయిరీ చేశారు. 2023వ సంవత్సరం తమ పేరు మీద దాదాపు రూ.4 లక్షల లోను తీసుకున్నట్లుగా రికార్డుల్లో ఉందని దీంతో రుణాలు కట్టాలని తమకు నోటీసులు అందడంతో ముగ్గురు ఫిర్యాదు చేసినట్లు మూర్తి పేర్కొన్నారు. అయితే లోనుకూ తమకు ఏ విధమైన సంబంధం లేదని వారు స్టేట్‌మెంట్ ఇచ్చారని దీనిపై సమగ్ర విచారణ చేసి నివేదిక సిద్ధం చేస్తామని మూర్తి పేర్కొన్నారు.

పారదర్శకంగానే భూసేకరణ : జేసీ



బుట్టాయగూడెం: పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కోసం సేకరించే భూములు పారదర్శకంగా సేకరించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రి రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులతో భూసేకరణపై సమావేశం నిర్వహించారు. అనంతరం జేసీ విలేకరులతో మాట్లాడుతూ భూసేకరణలో ఎటువంటి ఆరోపణలు రాకుండా అన్ని హక్కులు ఉన్న గిరిజనేతరుల భూముల్లో మాత్రమే సేకరిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ ఎంవీ రమణ, ఐటీడీఏ పీఓ కె.రాములు నాయక్, డీపీఓ కె.అనురాధ, డీఎల్‌పీఓ ఎం.రాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు చంద్రశేఖర్, ఆంజనేయులు, సతీష్, తహసీల్దార్లు వీవీ చలపతిరావు, ఉదయ్, ఎంపీడీఓ కె.జ్యోతి పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

జంగారెడ్డిగూడెం: పామాయిల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని పామాయిల్ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పామాయిల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై బుధవారం ఆయిల్‌పామ్ కార్మిక సంఘం జిల్లా మహా సభల్లో తీర్మానాలు చేశారు. నూతనంగా ఎన్నిక కాబడిన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు పి.రామకృష్ణ, సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జె.హరీష్, టి.సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలో సుమారు పదిహేను వేల మంది కార్మికులు ఆయిల్‌పామ్‌పై జీవనం సాగిస్తున్నారని వారికి రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రానికి వితరణ

జంగారెడ్డిగూడెం: జీకే చారిటబుల్ ట్రస్ట్ తొలి సేవా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పట్టణంలోని విరోధుల వారి వీధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం (58)కి విద్య, క్రీడా సామాగ్రి భద్రపరుచుకోవడానికి ఇనుప ర్యాక్, గ్యాస్ స్టవ్‌ను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి చావా రమేష్‌బాబు, కోశాధికారి గణిత పద్మశ్రీ, దాతలు విశాలాక్షి, సుధాకర్, మహాలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మోర్త విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ తుపాకల వరలక్ష్మి గణిత ఆనంద ప్రసాద్, సామాజిక వేత్త కేఎల్ఎన్ ధనకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

జంగారెడ్డిగూడెం: పట్టణంలో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మితో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొని, ఆసుపత్రిలో జరుగుతున్న సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. 25, 26 వార్డుల్లో రూ.47 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. మండలంలోని శ్రీనివాసపురం గ్రామానికి చెందిన ముప్పిడి రాజు 2021లో మృతి చెందినట్లు, అయితే గ్రామంలో ఒక వ్యక్తి ముప్పిడి రాజును హత్య చేశారని, అప్పటి నుంచి అధికారుల చుట్టూ తిరిగినా తమకు న్యాయం జరగలేదని, తమకు న్యాయం చేయాలని తల్లి ముప్పిడి మరియమ్మ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. అలాగే నవభారత్ కర్మాగారం నుంచి రసాయనిక వ్యర్థ జలాలు పట్టణంలోకి వదిలి వేస్తున్నారని కొండపల్లి భాస్కరరావు అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. వ్యర్థ జలాల వద్ద తన పాడి గేదెలు మృతిచెందాయని, తామంతా అనారోగ్యాలకు గురవుతున్నామని ఎమ్మెల్యేకు వివరించారు.

పేకాట స్థావరంపై దాడి

కొయ్యలగూడెం: జూద క్రీడలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై చంద్రశేఖర్ పేర్కొన్నారు. కొయ్యలగూడెం పరిసర ప్రాంతాల్లో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 3,800 నగదును, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తామని ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

జంగారెడ్డిగూడెం: రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడని స్టేషన్ రైటర్ పి.బాబూరావు తెలిపారు. ఆగస్టు 29వ తేదీన యర్రంపేటకు చెందిన కొండ్రెడ్డి చంద్రమౌళి స్థానిక బైపాస్ రోడ్డులో అతని స్నేహితుడు నరేష్‌తో కలిసి మండలంలోని వేగవరం వైపు వెళుతున్నట్లు తెలిపారు. ఆ సమయంలో రాజమండ్రి వైపు వెళుతున్న లారీ ఎదురుగా వచ్చి వీరి మోటార్ సైకిల్‌ను ఢీకొందన్నారు. దీంతో మోటార్ సైకిల్ వెనుక కూర్చున్న చంద్రమౌళి తీవ్రంగా గాయపడినట్లు చెప్పారు. అతడికి స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించినట్లు చెప్పారు. ఈ మేరకు చంద్రమౌళి తండ్రి కొండ్రెడ్డి పూర్ణచంద్ర వరప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.